www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231






తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక


# నన్నయ వాణి



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు — సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్ — ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక :39 | 12-07-2021 | పుటలు : 4


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు
డా.వై. ఎస్.రాజశేఖర్ రెడ్డి.

**వై** అంటే ప్రశ్న
**ఎస్** అంటే సమాధానం

**రెండు కలిపితే వై.ఎస్**

**ప్రజల గుండె స్పందనలు**
**విన్న డాక్టర్!!**
**జనంలోనుంచి వచ్చి**
**జనంలోకి వెళ్ళిన మనిషి!!**

జ్ఞాపకాలు, ఆలోచనలు సజీవంగా ఉన్నప్పుడు మనిషి జీవించి ఉన్నట్లే లెక్క. తనకు తాను ఏం చేయగలుగుతానని ఆలోచించిన ప్రతిచోటా వై.ఎస్ ఉంటారు. అలా అనుకునే ప్రతి వ్యక్తి వై.యస్. అవుతాడు.



నవ్వుకు రూపమొచ్చినవాడు
ఆత్మవిశ్వాసం నడిచొచ్చినవాడు
మల్లె పువ్వు లాంటి మనిషి
వైయస్ అంటే పంచెకట్టు వైయస్ అంటే పాదయాత్ర
వైయస్ అంటే జలయజ్ఞం వైయస్ అంటే
ఆరోగ్యశ్రీ వైయస్ అంటే ఫీజు రియంబర్స్మెంట్
వైయస్ అంటే రాష్ట్రంలో కొత్త
విశ్వవిద్యాలయాలు!!

పనియే దైవం! దానిని సక్రమంగా నిర్వర్తించటం, ఎవరి పని వారు చెయ్యటమే వారికి మనం ఇచ్చే ఘనమైన నివాళి!!

**- నన్నయవాణి.**

# వై.ఎస్.ఆర్ అందరికీ స్ఫూర్తి

## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**08.07.21 (మీడియాసెల్)** అందరికీ ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో పని చేసిన దివంగత నేత డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వై.ఎస్.ఆర్ చిత్రపటానికి వీసీ మరియు విశ్వవిద్యాలయ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రిగా వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు దేశ చరిత్రలోనే ప్రధాన ఘట్టాలని అన్నారు. ముఖ్యంగా ఉన్నత విద్యకు వై.ఎస్.ఆర్ పెద్దపీఠ వేసారని తెలిపారు. అందరికీ ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే వై.ఎస్ ఆలోచనల నుండి నూతన విశ్వవిశ్వవిద్యాలయాలు ఆవిర్భవించాయని చెప్పారు. ఈ క్రమంలోనే ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉభయగోదావరి జిల్లాలకు విశ్వవిద్యాలయంగా ఏర్పడిందని గుర్తుచేశారు. విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేయడంతో పాటు ఉన్నత విద్యను అభ్యసించడానికి పేదరికం అడ్డుకాకూడదని ఫీజురియింబర్స్మెంట్ ను ప్రవేశపెట్టిన మహానీయుడని అన్నారు. వై.ఎస్.ఆర్ ఆలోచనల నుండి పుట్టిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది అందరూ వై.ఎస్.ఆర్ ను ఆదర్శంగా తీసుకొని త్రికరణశుద్ధిగా విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం పాటుపడాలని తెలియజేశారు. పనిని దైవంగా భావించనప్పుడు అవరోధాలు ఉండవని, అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు.ఎవరి పనిని వారు సక్రమంగా చేయటమే వారికి మనమిచ్చే ఘన నివాళి అని అన్నారు. డా.రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ, రియింబర్సమెంట్ వంటి పథకాలు దేశ చరిత్రలో మహోన్నత ఘట్టాలని అభివర్ణించారు. అటువంటి మహానీయుణ్ణి స్మరించుకుంటూ ఉన్నత విద్యాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఈసీ మెంబర్లు ఆచార్య కె.శ్రీరమేష్, డా.బి.జగన్మోహనరెడ్డి, ప్రిన్సిపాల్స్ డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డా.కె.సుబ్బారావు మరియు విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



వై.ఎస్.ఆర్ చిత్రపటానికి పూలమాలికను వేసి నివాళులర్పిస్తున్న వీసీ



ఆచార్య టి.వి.కట్టిమణికి స్వాగతం పలికిన నన్నయ వీసీ,

# గిరిజనుల అభివృద్ధికి పాటుపడదాం

**08.07.21 (మీడియాసెల్)** గిరిజనుల అభివృద్ధికి సమష్టిగా పాటుపడదామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. గురువారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య తేజస్వీ కట్టిమణి సందర్శించారు. కట్టిమణికి పుష్పగుచ్ఛాన్ని అందించి నన్నయ వీసీ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. విశ్వవిద్యాలయంలోని భవనాలు, వసతులు మరియు వనరులను పరిశీలించిన అనంతరం వీసీ కార్యాలయంలో విశ్వవిద్యాలయాల అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వీసీ జగన్నాథరావు మాట్లాడుతూ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించి గిరిజనుల ఉన్నతకి పాటుపడాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గిరిజనులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాల్లో ఏజెన్సీ ప్రాంతంలో అనేక రకాల గిరిజన తెగలు జీవిస్తున్నాయని చెప్పారు. గిరిజనుల అభివృద్ధికి కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మరియు ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కూడా భాగస్వామ్యం అవుతుందని తెలిపారు. ఉభయగోదావరి జిల్లాల్లోని గిరిజనుల విద్యాప్రగతికి ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి సంబంధించిన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి స్పందించిన గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య టి.వి.కట్టిమణి మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన యూనివర్సిటీలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ భాగస్వామ్యం కావడం హర్షణీయమని అన్నారు. నన్నయ యూనివర్సిటీలో ట్రైబల్ సెంటర్ ఏర్పాటుకు సుముఖత చూపించారు. ఈ ప్రాంతంలో గిరిజన విద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఉభయగోదావరి జిల్లాల్లోని గిరిజనులకు అందుబాటులో ఉంటుందని అన్నారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సంభాషించారు. తరువాత విశ్వవిద్యాలయ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కట్టిమణి పాల్గొని నన్నయ విశ్వవిద్యాలయం కోవిడ్ కాలంలో నిర్వహించిన విద్యా ప్రగతిని తెలుసుకున్నారు. అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఈసీ మెంబర్లు, ప్రిన్సిపాల్స్, డీన్స్, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



నన్నయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన గిరిజన విశ్వవిద్యాలయ వీసీ

## సంపాదకీయం




# నాలుక - ప్రణాళిక

ఆలోచనలు అందరికీ వస్తాయి. కొన్ని సామాన్యంగా అనిపిస్తాయి. సామాన్యమైన ఆలోచనలోనే అసామాన్యమైన ఆంతర్యం దాగి ఉంటుంది. విత్తనంలో మర్రిచెట్టు ఉన్నట్లుగా. శిఖరారోహణ చేసే సాహసికులకు శిఖరం కన్నా సంకల్పబలం ఎత్తయినది. వారిలోని పట్టుదల ప్రధానమైంది. అందుకే వాళ్ళు స్ఫూర్తి శిఖరాలవుతారు.

అల్లసాని పెద్దనగారి మనుచరిత్రలోని ప్రవరునిలా ఆకాశంలో ఎగరకుండానే, వారి పాదాలకు లేపనంపూసే సిద్ధులు లేకుండానే పూర్తిగా భౌతిక శ్రమతో కాలినడకన, గుర్రాల మీద, నావల మీద ప్రపంచాన్ని అన్వేషించిన వాళ్ళు ఉన్నారు. ప్రపంచం అనేది ఇప్పుడున్న రూపంలో ఉన్నట్టు తెలియని రోజుల్లో లోకంలోని అన్ని దిక్కులు అందుకునే సాహసం చేశారు. బహుశా ఉరిమే ఉత్సాహం, నర్తించే సంతోషం, తెలుసుకోవాలనే సంకల్పం, సాధించాలనే పట్టుదల వారి సాహసాలకు, సాధనలకు కారణం. ఆలోచించటం ఒక ఎత్తయితే కార్యాచరణలోనికి తీసుకుని రావడం గొప్ప అంశం. ఒకచోట కూర్చుని ఆలోచించటం వేరు. ఆ ఆలోచన కార్యరూపం లోనికి తీసుకొని రావటం వేరు. ఒక చోట కూర్చుని కువిమర్శ చేసేవారుంటారు. తాము ఏ విషయం మీద విమర్శిస్తున్నారో ఆ విషయంలో వాళ్ళు బాధ్యులుగా ఉంటే అప్పుడు తెలుస్తుంది దాని లోతు,దాని సాధన, లోటుపాట్లు, శ్రమ. నరంలేని నాలుక ఏదైనా ఎలా అయినా మాట్లాడుతుంది. నాలుక కన్నా ప్రణాళిక ముఖ్యమైంది. ప్రణాళికను ఆచరించిచూపడం ముఖ్యమైంది. దుర్యోధనునిది నాలుక. ధర్మరాజుది ప్రణాళిక. కురుక్షేత్ర యుద్ధమే దానికి మంచి ఉదాహరణ.

కొండకోనల్లో, అరణ్యంలో బ్రతికిన మనిషికి వచ్చిన ఆలోచన చక్రం! తన ఆలోచనను తన అభివృద్ధికి కారకంగా చేసుకున్నాడు. ప్రపంచగతిని మార్చేశాడు. లేచాడు.చెక్కలతో చక్రాన్ని తయారు చేశాడు. అలా మొదలైన చక్రం మానవ ప్రగతి రథచక్రంగా కదలడం మొదలయ్యాక సమూహాలు కదలటం మొదలెట్టాయి. మనిషి కొత్త ప్రాంతాలను చూశాడు. ఎద్దుల బండి నడిచింది. కుమ్మరి చక్రం తిరిగింది.మట్టిముద్ద వంట పాత్రలయింది. సైకిల్, స్కూటర్, కార్, ట్రైన్, విమానం.... మనిషి కాలచక్రాన్ని నియంత్రించలేడేమో కానీ కాలంతో పరిగెత్తగలిగే చక్రాన్ని కనిపెట్టిన నాటి మనిషికి ఎప్పటికైనా,ఎన్ని తరాలైనా బానిసలే.చెక్కు చెదరని లక్ష్యశుద్ధి ఉన్నవారికి కార్యాచరణతో ముందుకు నడిచేవారికి సలామ్ కొట్టాల్సిందే! కూర్చుని ఊరికినే ఆలోచించే వారిని, ద్వేషించే,దూషించే వారిని, ఎదిగేవారికి అడ్డుగా నిలిచే వారిని, బురద చల్లేవారిని పట్టించుకోవడం మానేస్తేనే ప్రపంచం ఎదుగుతుంది.

అంగీకరించటం అనేది సానుకూలమైన భావన! కార్యాచరణలో ఉన్న మనుషుల పనులన్నీ నచ్చాల్సిన అవసరం లేదు. అడ్డుకోవటం అనేదానికి బదులు అంగీకరించటం అనేది మొదలైతే వ్యతిరేకమైన భావాలు సానుకూలంగా మారుతాయి.ప్రపంచంలోని ఆవిష్కరణలు ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని నెగ్గుకు వచ్చినవే. ఆలోచిస్తూ కూర్చున్నవారు కాదు వాళ్లు. లేచి నడచి తమ పాద ముద్రలను 'లోకస్తదనువర్తతే' అన్నట్లుగా మార్గదర్శకంగా నిలిచినవాళ్ళు.సుద్దముక్కతో రోడ్డుమీద మైకోవిస్కీ అనే మహానుభావుడు "మూవ్" అని రాశాడు. కదులు. ఒక చోట ఉండిపోకు. కూర్చుని అసలు ఉండిపోకు. 'కుదిరితే పరిగెత్తు. లేకపోతే నడువు. అదీ చేత కాకపోతే పాకుతూ పో! అంతే కానీ ఒకేచోట కదలకుండా ఉండిపోకు' అంటారు శ్రీ శ్రీ. సాధించి గెలుచుకునేదేదో ఎదురుచూస్తోంది. కదులు! ఆ విషయాన్ని,విజయాన్ని కలుసుకో! జయోస్తు!!

# రైతు ప్రాతఃస్మరణీయుడు

## నన్నయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాధరావు

**08.07.21 (మీడియాసెల్)** మనం తినే ప్రతి అన్నం మెతుకులో రైతు కష్టం దాగి ఉందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. వై.ఎస్.ఆర్.జయంతి, రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిలాంత్రోపిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పలువురు ఆదర్శ రైతులకు "కిసాన్ బంధు విశిష్ట సేవా పురస్కార ప్రదానోత్సవసభ" యూనివర్సిటీలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ సభను ఉద్దేశించి మాట్లాడుతూ అన్నదాత అయిన రైతు ప్రాతఃస్మరణీయుడని అన్నారు. రైతు లేకపోతే మనిషి మనుగడ ప్రశ్నార్థకం అన్నారు. రైతు ముఖంలో చిరునవ్వు చిందినప్పుడే దేశం పురోగమిస్తుందన్నారు. రైతు ఈ దేశానికి వెన్నెముక అని అలాంటి రైతుకు ఎల్లవేళలా అండగా ఉండాలని కోరారు. కోవిడ్ కాలంలో ఎందరో కన్నుమూశారని దేవుడిచ్చిన ఈ జీవితాన్ని సమాజం కోసం కొంత



ఆదర్శ రైతును సన్మానిస్తున్న వీసీ జగన్నాధరావు



కేటాయించాలని సూచించారు. ఫిలాంత్రోపిక్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.అద్దంకి రాజా మాట్లాడుతూ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని కొంతమంది ఆదర్శ రైతులను సత్కరించుకోవడం రైతులోకానికి మనమిచ్చే గౌరవంగా భావిస్తున్నట్టు వెల్లడించారు. అనంతరం వైస్ చాన్సలర్ ఉభయగోదావరి జిల్లాలకు చెందిన పదిమంది రైతులకు కిసాన్ బంధు విశిష్ట సేవా పురస్కారాలను ప్రదానంచేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ప్రఖ్యాత వాస్తు నిపుణులు డాక్టర్ కె.వి.రెడ్డి కిసాన్ బంధు మరియు విశిష్ట సేవా పురస్కార గ్రహీతలు కర్రి సత్తి రెడ్డి(రావులపాలెం), రెడ్డి వీర వెంకట సత్యనారాయణ మూర్తి (గుమ్మిలేరు), సుంకవల్లి రామారావు (మునిపల్లి), గుంటూరి పెద్దిరాజు (కొమ్ము చిక్కాల), బి.గోవింద వరప్రసాద్ (కడియ పులంక), నాతిరెడ్డి వరప్రసాద (చినకాపవరం), సత్యవాడ శ్రీనివాస్(ఉండి), యాళ్ల హనోక్ వర్ధన్(భీమవరం), శెట్టి వీర వెంకట సత్యనారాయణ (కడియం), ఎం.బి.నాగేశ్వర రావు (తాడేపల్లి గూడెం) పాల్గొన్నారు.

# 26 నుండి పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు




**06.07.21 (మీడియాసెల్)** కోవిడ్ నిబంధనలను అనుసరించి ఈనెల 26వ తేదీ నుండి పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. బుధవారం విశ్వవిద్యాలయ పరీక్షా విభాగాధికారులతో వీసీ పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని ఏర్పాటుచేసి పలు అంశాలపై చర్చించారు. పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు, పరీక్షల నిర్వహణ తదితర విషయాలను రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, డీన్ ఎగ్జామినేషన్ డా.ఎ.మట్టారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎస్.లింగారెడ్డితో వీసీ చర్చించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాలు ఇప్పటికే పరీక్షలను నిర్వహిస్తున్నాయని, ఈ క్రమంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలను 26వ తేదీ నుండి నిర్వహిస్తోందని అన్నారు. పీజీ పరీక్షలతోపాటు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో డిగ్రీ పరీక్షలను కూడా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కోవిడ్ నిబంధనలను పాటిస్తూ జూలై చివరి వారంలో పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు, ఆగస్టు మొదటి వారంలో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధం కావాలని అన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరియు అనుబంధ కళాశాలలు రెండవ దశ కోవిడ్ ప్రారంభమైన నాటి నుండి ఆన్లైన్ తరగతులను సమర్థవంతంగా నిర్వహించి పాఠ్యాంశాలను పూర్తి చేశారని చెప్పారు. తొలిదశ కోవిడ్ సమయంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు మధ్య సమర్థవంతంగా పరీక్షలు నిర్వహించినట్లు ఇప్పుడు కూడా మరింత అప్రమత్తంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పరీక్షల నిర్వహణకు సిద్ధం కావాలని, పరీక్ష కేంద్రాల ఏర్పాట్లను ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షించాలని సూచించారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు సంబంధించిన మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేందుకు పక్కా ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులకు వీసీ సూచించారు.

## మంచి మాట



ఎన్నేళ్లు బ్రతికామో లెక్కించుకోకు. దేవుడు నీకిచ్చిన అవకాశాలను ఉపయోగించుకుని,నువ్వు సమాజానికి ఏం చెయ్యగలిగావన్నది మాత్రమే ఆలోచించు.

- వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి.












# ప్రపంచ జనాభా దినోత్సవం

ప్రజలు, ప్రదేశం, ప్రభుత్వం, సార్వభౌమాధికారం ఒక రాజ్యానికి ఈ నాలుగు మూలకాలు వుంటాయని రాజనీతి తత్వవేత్తలు తెలిపారు. రాజ్యానికి ప్రజలే మూలం.అలాగే 'దేశమంటే మట్టి కాదు మనుషులని' గురజాడ అప్పారావు గారు అన్నారు. ఏదైనా ఒక ప్రాంతంలో నివసించే ఒకే జాతికి చెందిన జీవుల సమూహమే'జనాభా. ప్లేటో తన రిపబ్లిక్ గ్రంథంలో ఉత్తమ రాజ్య లక్షణాలను వివరిస్తూ " రాజ్య జనాభా 5040" మంది ఉండాలని తెలిపాడు. అలాగే అరిస్టాటిల్ ఏదైనా ఒక రాజ్యం ఉత్తమరాజ్యంగా ఉండాలంటే జనాభా నియంత్రణ ఉండాలని,నిర్దిష్ట పరిమితులు విధించాలని క్రీస్తు పూర్వమే వారి గ్రంథాల్లో పేర్కొన్నారు. అధిక జనాభా నేడు ప్రపంచం ఎదుర్కుంటున్న అతిపెద్ద సవాలుగా పరిణమించింది. నేడు ప్రపంచంలో అధిక జనాభా గల దేశాల్లో చైనా, భారత్ లు మొదటి రెండు స్థానాల్లో వున్నాయి. తర్వాత స్థానాల్లో వరుసగా అమెరికా, ఇండోనేషియా, పాకిస్థాన్, బ్రెజిల్ వున్నాయి. దేశాల అభివృద్ధిని ఆ దేశాల జనసాంద్రత ఆధారంగా గణిస్తారు. ఒక చ. కి.మీ ప్రాంతంలో నివసించే జనాభా సంఖ్యను జనసాంద్రత అంటారు. 140 కోట్లకు చేరువలో వున్న భారత జనసాంద్రత 464. చైనా మొత్తం జనాభా 144 కోట్లు ఉండగా జనసాంద్రత కేవలం 153 మాత్రమే. అమెరికా జనాభా 33 కోట్లు ఉండగా జనసాంద్రత 36. భారతదేశానికి స్వాతంత్ర్య%శీ% వచ్చి 70 ఏళ్ళయినా ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశంగా వుండడానికి మన దేశ%శీ%లో వున్న అధిక జనాభా ఒక కారణం. ప్రపంచ జనాభాలో ఆసియ ఖండం 59.5 శాతాన్ని ఆక్రమించింది. ఆఫ్రికా 17.2 శాతం , ఐరోపా 9.6 శాతం కలిగివున్నాయి. ప్రపంచ జనాభాలో భారత్ 17 శాతం ఆక్రమించి పేదరికం, నిరుద్యోగం, పర్యావరణ కాలుష్యం, సహజ వనరుల కొరత వంటి అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నాం. 2021 నిరుద్యోగ గణాంకాలను చదువుల వారీగా పరిశీలిస్తే భారత్ లో గ్రాడ్యుయేట్స్ 16.3 శాతం, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ 14.2 శాతం నిరుద్యోగుల వున్నారు.అంతర్జాతీయ కార్మిక సంస్థ సర్వే ప్రకారం భారత్ లో 10 కోట్ల మంది చిన్నారులు పేదరికంతో బాలకార్మికులుగా వున్నారు.జనాభా పెరుగుదల వలన కలిగేదుష్పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఐక్యరాజ్యసమితి "1987" నుండి ప్రతి సంవత్సరం "జులై 11" ను "ప్రపంచ జనాభా దినోత్సవంగా" ప్రకటించింది. మూడు దశాబ్దాలుగా ప్రపంచ జనాభా దినోత్సవాలు జరుపుతున్న ప్రపంచ జనాభా నేటికీ సుమారు 800 కోట్లుకు చేరువలో వుంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు మాత్రమే కాదు విద్యావంతులు, పౌరులు జనాభా నియంత్రణ మన బాధ్యతగా తలంచి ప్రజలకు అహగాహన కల్పించాలని కోరుకుందాం.

**- కురమా సంపత్ కుమార్,అధ్యాపకులు,గోపాలపురం**

## స్వర సందేశం..

మనందరి ప్రపంచం ఈ జనాభా
పెరుగుతూనే ఉంది అను నిత్యం
గమనిస్తే ఊహిస్తేమనకు వాస్తవం
తలుస్తూంది ఓ నిజమైన సత్యం!
పుట్టిపెరిగిన ప్రపంచ జనమందు
ఒట్టిగ కూర్చోని తినేవారికే విందు
పనిచేసేవారికేమొ ఇక దారి బందు
గమనించి ముందుకెళ్ళటే పసందు
జనాభాతో నిండిన ఈ భూగోళం
సృష్టిస్తుంది మనలో గందరగోళం
ఆహారం సరిపోక ఇక ప్రతి వేళ
మనందరిలోన ఒకటే గోల గోల !
తలెత్తుతుంది ఆహారం సంక్షోభం
చేతులెత్తేస్తుంది మనదేశ సంక్షేమం
వేలెత్తి చూపుతుంది ఇక పరదేశం
జోరెత్తి ఇవ్వాలిరా నీ స్వరసందేశం
మన జనాభా కట్టడికి గతమందు
ఆపరేషన్లుచేస్తిమి మనంముందు
అప్పటికి ఆ కార్యం బహు పసందు
ఇక్కట్లలో చిక్కుకోకు నీవికముందు!

- గుర్రాల లక్ష్మారెడ్డి, కల్వకుర్తి.

## ప్రపంచ జనాభా దినోత్సవం

మనమే ఘనమైన జనం
జనం జగతికి మూలధనం
ప్రగతికి సోపానం
ప్రకృతి ప్రసాదించిన ప్రసాదం
జనానికీ ఉండాలి పరిమితం
అలావుంటే బ్రతుకులు స్వర్గం
పుడమికీ కావాలి విరామం
మితిమీరితే మోయలేదు భారం
ప్రపంచ జనాభా కాకూడదు అధికం
అందరమూ మనుషులం
మరిదేనికీ ఉత్సాహం
"అపుత్రస్య గతిర్నాస్తిః"అని
ఉన్నది కదా ఆర్యోక్తి!
పుత్రులుపుత్రికలని పెంచేయకు
జననికి జననాలతో కాకూడదు
ధరిత్రిలో పెనుభారం!
కావాలి కోరుకోవాలి
క్షితి స్వర్గ తుల్యం!!


– ఖండాపు మన్మథరావు, తెలుగు అధ్యాపకులు, విజయవాడ.

## అధిక జనాభా అనర్థాలకు మూలం

అధిక జనాభా అనర్ధాలకు మూలం
అందుకే అయినది జులై పదకొండున
ప్రపంచజనాభా దినం.
అధికమవుతున్నజనాభా తరుగుతున్న ఆహారం.
జనాభా పెరుగు దలకు మూలం
బాల్య వివాహాల వైనం.
అభివృద్ధి పధానంగా వెళుతున్న దేశాలలో
జనాభా పెరుగుదల ఎంతో అవసరం.
అభివృద్ధి చెందుతున్న మనదేశంలో జనాభా
పెరుగుదల అభివృద్ధికి ప్రతిబంధకం.
అవిద్య, మూఢనమ్మకాలు, మత ఛాందస
వాదాలు జనాభా పెరుగు దలకు దోహదం.
బాల్యవివాహాలు ఒక కారణం.
మగ సంతానంపై మక్కువ మరో కారణం.
అనాదినుండి మహిళలను పిల్లలు కనే
యంత్రాలలాగే చూడటం.
ఉమ్మడి కుటుంబవ్యవస్థ ఒక కారణం.
కరోనా వలన లాక్ డౌన్ కారణంగా ఇంటికి
పరిమితం కావడం.,
నగరాలలో పనులు దొరక్క పోవడం.
ఆహారకొరత, మౌళిక వసతుల రూప కల్పన అనితరసాధ్యం.
మహిళలను జాగృతం చేస్తూ మహిళా
సాదికారతకై పెద్ద పీటవేయాలి.
గర్భ నిరోధక సాధనాలు వినియోగం పై
అవగహన కల్పించాలి.
ఇద్దరు బిడ్డలు కన్నాఎక్కువైన వారు చట్ట సభల్లో
పోటీకి అనర్హులుగా ప్రకటించాలి.
ప్రభుత్వ పథకాలను ఒకరిద్దరు పిల్లలున్న
తల్లితండ్రులకు మాత్రమే అని చట్టం రావాలి.
పైవన్నీ జరగనినాడు దేశము తిరోగమనమై
అధికజనాభా దేశ ప్రగతికి ప్రతి బంధకం.

– కొరారి వెంకటరత్నం.
తెలుగు ఉపాధ్యాయులు.ఛేల్దీగాని పల్లి. చిత్తూరు జిల్లా.

## అధిక జనాభా వలన భూమిపై బ్రతుకుభారం!




2021 జూల్కె నాటికి ప్రపంచ జనాభా 7.9 బిలియన్స్ గా ఉందని యూ.ఎన్.ఓ. ప్రకటించడంతో ప్రపంచ దేశాలు ఉలిక్కిపడ్డాయి. ఇప్పటికే ప్రపంచంలో వంద కోట్లకు పైగా జనాభాకు రోజుకు మూడు పూటల తిండి దొరకడం లేదు. నలభై కోట్ల మంది ప్రజలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. మరి ఇంతకు రెట్టింపుగా జనాభా పెరిగితే మన పరిస్థితి ఏంటి!భవిష్యత్తు అవసరాలు ఎలా తీరుతాయి. అసలు ఇంతటి జనాభా పెరుగుదలకు కారణం మనిషి కదా.. మనిషి తన పతనానికి తానే కారణం అయ్యాడు. భూమి భుజాలపై భారం పెరిగిపోయింది. మానవ మనుగడకు ముప్పు ఏర్పడింది. విపరీతమైన జనాభా పెరుగుదల వలన ఆహార ధాన్యాల కొరత, మౌలిక వసతులు లేమి, పేదరికం నిరుద్యోగం ఏర్పడుతాయి. నివాస స్థలాలు దొరక్క అడవులని నాశనం చేయవలసిన పరిస్థితి వస్తుంది. దీంతో పర్యావరణ సమతుల్యం దెబ్బతిని భూమి వేడెక్కిపోతుంది. జీవవైవిధ్యం దెబ్బతింటుంది. భూమి మీద మనుగడ కష్టం అవుతుంది. అందువల్ల పెరుగుతున్న జనాభాను అరికట్టాలంటే సామాజిక, వ్యక్తిగత, ప్రభుత్వాల కృషి చాలా అవసరం. మూఢ నమ్మకాలను పక్కన పెట్టి ఆడపిల్ల అయిన, మగ పిల్లవాడయినా ఒక్కటే అనే భావన అందరిలో కలగాలి. కుటుంబ నియంత్రణ, బాల్య వివాహాలుని రూపు మాపడం వలన జనాభాను అరికట్టవచ్చు. అలాగే టీవీల్లో, పత్రికల్లో, సామాజిక మద్యమాల్లో జనాభా నియంత్రణ కార్యక్రమాలు చేపట్టడం వలన కూడా ప్రజల్లో అవగాహన కలిగించి చాలా వరకు జనాభాని నియంత్రించవచ్చు. చిన్న కుటుంబం... చింతలేని కుటుంబం అనే విషయం అందరికీ అర్థం కావాలి.

**- బి.సుశాంత్ కుమార్**
**బి.ఎడ్.ప్రథమ. నన్నయ యూనివర్సిటీ.**




ఆర్ట్:కిషోర్,బి.కాం.(ఎస్.కె.వి.టి.కళాశాల)

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in